సాక్షి తిరుపతి

శుక్రవారం । 19 । జనవరి । 2024



మేము సైతం

అంబేడ్కర్ స్మృతి వనం ప్రారంభోత్సవానికి పలువురు బహుజనులు తిరుపతి నుంచి స్వచ్ఛందంగా తరలివెళ్లారు. - 8లో



సచివాలయం.. పల్లెకు మకుటం

సచివాలయాలు అభివృద్ధికి తలమానికంగా నిలుస్తున్నాయి. సకల సేవలు అందించే సేవాలయాలుగా నిలుస్తున్నాయి. - 8లో



బైక్ దొంగల అరెస్ట్

నాయుడుపేటలో బైక్ దొంగలను అరెస్ట్ చేసి, రూ.7.95 లక్షల విలువ చేసే బైక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. - 8లో

న్యూస్‌రీల్

సమన్వయం..సానుకూలం!

- చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్తగా డెప్యూటీ సీఎం నారాయణస్వామి
- జీడీనెల్లూరుకు ఎంపీ రెడ్డెప్ప



మంత్రి నారాయణస్వామి



ఎంపీ రెడ్డెప్ప

సాక్షి, చిత్తూరు: గెలుపే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ అడుగులు వేస్తోంది. కొన్ని నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లను మార్పుచేస్తూ దూసుకుపోతోంది. ఇందులో భాగంగా గురువారం రాత్రి డెప్యూటీ సీఎం కే.నారాయణస్వామిని చిత్తూరు పార్లమెంట్ (ఎస్సీ) నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించింది. అక్కడ ఎంపీగా ఉన్న ఎన్.రెడ్డెప్పను జీడీనెల్లూరు (ఎస్సీ) నియోజవర్గ సమన్వయకర్తగా నియమించింది. నారాయణస్వామి గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో సత్యవేడు ఎమ్మెల్యేగా, 2014, 2019లో వైఎస్సార్‌సీపీ జీడీనెల్లూరు ఎమ్మెల్యేగా రెండుసార్లు విజయం సాధించారు. ఆయన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా, బాధ్యతలు నిర్వర్తించారు. అలాగే ఎంపీ రెడ్డెప్ప సోమల మండలం వల్లిగట్ల గ్రామంలో జన్మించారు. వైజాగ్ ఆంధ్రా యూనివర్సిటీ నుంచి మాస్టర్ లా పట్టా అందుకున్నారు. పుంగనూరులో న్యాయవాదిగా వృత్తిని ప్రారంభించి, పీపీగా నియమితులయ్యారు. ఆ సమయంలో చౌడేపల్లె సమితి అధ్యక్షుడిగా పోటీ చేశారు. పుంగనూరు న్యాయవాద సంఘం అధ్యక్షుడిగా 20 ఏళ్లు పనిచేశారు. మంత్రి పెద్దిరెడ్డి శిష్యుడిగా గుర్తింపు పొందారు. 2019 ఎన్నికల్లో చిత్తూరు పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. వీరి నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం



గ్యాస్‌కనెక్షన్లు పంపిణీ చేస్తున్న కేంద్రసహాయ మంత్రి

ఓజిలి: దేశంలో పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ పనిచేస్తున్నారని కేంద్ర కమ్యూనికేషన్ సహాయ మంత్రి దేవ్‌సింగ్ చౌహాన్ తెలిపారు. మండలంలోని తిరుమలపూడి గ్రామంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర గ్రామసభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సంక్షేమ పథకాలు ప్రతిఒక్కరికీ అందాలన్నారు. 2047 నాటికి దేశంలో పేదరికం లేకుండా చేయాలన్నదే సంకల్పంగా మోదీ అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన పలు రకాల స్టాల్స్‌ను పరిశీలించారు. ఉజ్వల దీపం కనెక్షన్లు, ఆయుస్మాన్ భారత్ హెల్త్‌కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సర్పంచ్ ఏకసిరి గోపాలయ్య, ఆర్డీఓ మునిచంద్ర, రాష్ట్ర ప్రధానకార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు చంద్రప్ప, మండల అధ్యక్షులు ఆరుమూళ్ల వరప్రసాద్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ ప్రీ ఫైనల్

తిరుపతి ఎడ్యుకేషన్ : జిల్లాలో ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకు ఇంటర్మీడియెట్ ప్రీ ఫైనల్ పరీక్షలను నిర్వహించనున్నట్లు తిరుపతి జిల్లా డీఐఈఓ స్వర్ణలత తెలిపారు. దీనికి సంబంధించి ఇప్పటికే జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలు ప్రీ ఫైనల్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రోజూ ఉదయం ప్రథమ సంవత్సరం, మధ్యాహ్నం ద్వితీయ సంవత్సర విద్యార్థులకు పరీక్షలు ఉంటాయన్నారు. ప్రీ ఫైనల్ పరీక్ష పబ్లిక్ పరీక్షకు ప్రిపరేషన్ అని, దీనిని గుర్తించి విద్యార్థులందరూ గైర్హాజరుకాకుండా హాజరు కావాలని కోరారు.



పుంగనూరులో చంద్రబాబు పర్యటన సందర్భంగా పోలీసు వాహనాలను ధ్వంసం చేస్తున్న టీడీపీ అల్లరిమూకలు(ఫైల్)




నారా లోకేష్‌తో గంజాయి నిందితుడు హరికృష్ణ సెల్ఫీ (ఫైల్)

పచ్చసేన రక్తచరిత్ర

ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా అన్నట్టు.. టీడీపీ అధినేత చంద్రబాబు దగ్గర నుంచి, లోకేష్, ప్రధాన నాయకులుగా ఉన్నవారిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. ప్రస్తుతం వారంతా కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. అధినాయకులే నేర చరిత్ర కలిగి ఉంటే ఆ పార్టీ ద్వితీయ, తృతీయ శ్రేణులు సైతం నేరాలు చేయడంలో ఆరితేరిపోయారు. మోసాలు.. కబ్జాలు.. దాడులు.. అల్లర్లు.. హత్యలకు పాల్పడి విచారణ ఎదుర్కొంటున్నారు. నిత్యం కోర్టుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇదే ప్రధాన అర్హతగా చూపించి వచ్చే ఎన్నికల్లో బరిలో దిగేందుకు ముమ్మరంగా యత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే వైఎస్సార్‌సీపీ సంక్షేమ పాలనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారు. అయితే తమ్ముళ్ల నేరాల చరిత్ర తెలిసిన సామాన్యులు మాత్రం ఎన్నికల నాటికి ఎన్ని దారుణాలు చూడాల్సి వస్తోందో అని భయాందోళనకు గురవుతున్నారు.

చిత్తూరు జిల్లాలో టీడీపీ నేతలపై అనేక కేసులు



- తామూ తక్కువేం కాదంటున్న జనసేన నాయకులు
- బాబు పాలనలోనే చిత్తూరులో మేయర్ దంపతుల జంటహత్య
- గంజాయి విక్రయిస్తూ పట్టుబడిన టీడీపీ నాయకులు
- పుంగనూరు అల్లర్లలో పాత్రధారులు, సూత్రధారులు పచ్చమూకలే..
- కోర్టుల చుట్టూ తిరుగుతున్న నిందితులు
- ఇప్పుడు టికెట్ల రేసులో ముందు వరుసలో ఉన్నదీ వారే..

అవసరాల కోసం వచ్చి పోయే పాత్రలు తప్పా.. హీరోలు, విలన్లు లేరీ నాటకంలో అని ఓ సినిమాలో డైలాగ్.. అలాగే చంద్రబాబుకు కూడా తన అవసరాలు, పదవుల పిచ్చి, కొడుకు లోకేష్ భవిష్యత్ తప్ప ఇతరత్రా వాటితో తనకు సంబంధం ఉండదు. సెంటిమెంట్లు, మంచి, చెడ్డా అనేవీ ఏవీ కూడా తన డిక్షనరీలో అసలు ఉండవు. తన పబ్బం గడుపుకునేంత వరకే ఎవరితో అయిన నడుస్తారు. తరువాత నట్ట నడిరోడ్డులో వదిలేయడం బాబుకు వెన్నతో పెట్టిన విద్య. తన సభల్లో ప్రసంగాల ద్వారా రెచ్చగొట్టడం, సంఘ విద్రోహ శక్తులతో దాడులు చేయించడంలో ఆయన మంచి సిద్ధహస్తుడు.

సాక్షి టాస్క్‌ఫోర్స్ : చిత్తూరు జిల్లాలోని ఏడు నియోజవర్గాల పరిధిలో చాలామంది తెలుగు తమ్ముళ్లు బోలెడన్ని కేసులు ఎదుర్కొంటున్నారు. సాక్షాత్తూ నారా లోకేష్‌కు అత్యంత సాన్నిహిత్యంగా మెలిగే వ్యక్తులే ఇటీవల గంజాయి విక్రయిస్తూ అడ్డంగా దొరికిపోయిన విషయం విదితమే. ఇక టీడీపీ అధినేత చంద్రబాబు సాక్షిగా పుంగనూరులో పచ్చమూకలు అల్లర్లకు పాల్పడిన ఘటనను జిల్లావాసులు ఇప్పటికీ మరచిపోలేదు. ఈ క్రమంలోనే టీడీపీకి వత్తాసు పలికేక జనసేనకు చెందిన నేతలు కూడా పలువురు వివిధ కేసుల్లో కోర్టులు, పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరుగుతుండడం వందశాతం నిజం. పైగా పోలీసు కేసులు ఉన్న నేతలు, ఆరోపణలు ఎదుర్కొంటున్న నాయకులే రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన టికెట్లు ఆశిస్తుండడం గమనార్హం.

పూతలపట్టు నియోజకవర్గంలో..

- 2023 సెప్టెంబర్ 11న మండల కేంద్రమైన పూతలపట్టులో టీడీపీ నాయకులు అల్లరి మూకలను రెచ్చగొట్టి ఆరు ఆర్టీసీ బస్సులను ధ్వంసం చేశారు. దీనిపై పూతలపట్టు పోలీసు స్టేషన్‌లో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ మురళిమోహన్‌పై కేసు నమోదైంది.
- 2022 ఆగస్టు 4వ తేదీ పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్‌బాబు వేపనపల్లె పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తుండగా జనసేన యువకులు కొందరు దౌర్జన్యం చేశారు. ఈ ఘటనలో 10 మందిపై కేసు నమోదైంది.
- 2021లో జరిగిన పంచాయతీ ఎన్నికల సందర్భంగా చిత్తూరు ఎమ్మెల్సీ దొరబాబు యాదమరి మండలం జోడిచింతల వద్ద టీడీపీ నాయకులను రెచ్చగొట్టడంతో వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడి చేశారు. ఈ ఘటనలో 9 మందిపై యాదమరి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.
- 2018లో యాదమరి మండలం తాళ్లమడుగులో వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడి చేసిన టీడీపీ నాయకులు విజయేంద్రవర్మ, ఆయన అనుచరులు 9 మందిపై యాదమరి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.
- 2019 సంవత్సరంలో ఏప్రిల్‌లో అప్పటి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ బాబుపై మండలంలోని కట్టకిందపల్లె పోలింగ్ కేంద్రంలో టీడీపీ నాయకులు కోలా రమేష్, అతని అనుచరులు దాడి చేయడంతో ఆరుగురిపై ఐరాల మండలంలో కేసు నమోదైంది.
- పేరయ్యగారిపల్లెలో 2019 ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు దళితుడు రమేష్‌పై అదే గ్రామానికి చెందిన కొందరు టీడీపీ నేతలు కులంపేరుతో దూషించడంతో 10మందిపై ఐరాల మండలంలో కేసు నమోదైంది.
- 2016లో అప్పటి సిట్టింగ్ ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌పై ఐరాల మండల ఎంపీడీఓ కార్యాలయంలో మండల మీట్‌లో మాట్లాడుతుండగా అప్పటి సహకార బ్యాంక్ చైర్మన్ గిరిబాబు నాయుడు కులంపేరుతో దూషించడంతో ఐరాల పోలీసుల స్టేషన్‌లో కేసు నమోదైంది.

కరారి దంపతుల దారుణ హత్యతో ఉలికిపాటు





కొనఊపిరితో ఉన్న కఠారి మోహన్, మేయర్ కఠారి హేమలతను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం(ఫైల్)

రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపిన చిత్తూరు మేయర్ దంపతుల జంట హత్యలు గత టీడీపీ ప్రభుత్వ పాలనలోనే జరిగిన విషయం విదితమే. 2015 నవంబరు 17వ తేదీన సాక్షాత్తు చంద్రబాబు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న సందర్భంలోనే పట్టపగలు చిత్తూరు కార్పొరేషన్ కార్యాలయంలో ఉన్న మేయర్ కఠారి అనూరాధ, ఆమె భర్త కటారి మోహన్‌ను అత్యంత పాశవికంగా హత్య చేశారు. ఈ జంట హత్యలతో రాష్ట్రం ఉలికి పాటుకు గురైంది. శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన ఈ ఘటనలో బాధితులు, అరెస్ట్ అయిన ముద్దాయి చింటూ అందరూ బంధువులే. వీరంతా టీడీపీ వారే. ఈ ఆరోపణల్లో చింటూ ప్రధాన నిందితుడిగా, అండర్ ట్రయల్ ఖైదీగా జైలులో ఉన్నాడు. అయితే అనురాధ, చింటూ కుటుంబాల మధ్య చిచ్చుపెట్టి ఇద్దరి హత్యకు దారి తీసే పరిస్థితులు కల్పించింది మాత్రం అప్పటి టీడీపీకి చెందిన కీలక నేతలే ఉండడం బహిరంగ సత్యం. వీళ్లను అప్పట్లో టీడీపీకి అనుకూలంగా ఉన్న పోలీసులు కేసుల నుంచి చాకచక్యంగా తప్పించారన్న ఆరోపణలు కూడా బలంగా వినిపించాయి.

పలమనేరు నియోజకవర్గంలో..

- 2009లో అప్పటి టీడీపీ ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి పార్వేటలో భాగంగా తుపాకి వాడి కాల్చినందున ఆయనపై గంగవరం పీఎస్‌లో కేసు నమోదైంది. ఆపై 2015లో ఆ కేసును కోర్టు కొట్టేసింది.
- 2005లో పెద్దపంజాణి సింగిల్‌విండోలో షేర్ల నమోదు విషయంగా జరిగిన గొడవపై మాజీ మంత్రి అమరనాథరెడ్డి, అదే మండలానికి చెందిన టీడీపీ నాయకులు రోజారెడ్డి, నేలపల్లి రాజారెడ్డిపై కేసులు నమోదయ్యాయి. ఆపై కోర్టులో డిస్పోజయ్యాయి.
- గతేడాది పుంగనూరు విధ్వంసం కేసులో మాజీమంత్రి అమరనాథ రెడ్డిపై కేసు నమోదైంది. ఇందులో ఆయన బెయిల్ పొందారు. ఇదే కేసుకు సంబంధించి వీకోట మండలానికి చెందిన ఎనిమిది మందిపై కేసులు ఉన్నాయి. అందులో వీకోట టీడీపీ అధ్యక్షుడు రంగనాథ్, నాయకులు సోము, ఉదయ్, భక్తవత్సలం, రాంబాబు, విశ్వనాథ్, కోదండ బెయిల్‌పై ఉన్నారు.
- పలమనేరు పట్టణ టీడీపీ అధ్యక్షుడు కుట్టిపై గతంలో నిబంధనలకు విరుద్ధంగా టపాకాయలను విక్రయిస్తున్నందున కేసు నమోదైంది.
- పట్టణానికే చెందిన టీడీపీ మైనారిటీ నేత ఖాజాపై అనుమతి లేకుండా ధర్నాలు చేయడంపై కేసులు నమోదయ్యాయి.
- మాజీమంత్రి అమరనాథ రెడ్డి కారుడ్రైవర్ జీడిమాకులపల్లికి చెందిన రామచంద్ర తండ్రి శ్రీరాములు, మాజీమంత్రి అనుచరులైన ఏకాంబరం, గిరిబాబు కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడడంతో కేసులు నమోదయ్యాయయి.

చల్లా బాబు గత చరిత్ర పరిశీలిస్తే..

తొలి నుంచి నేర చరిత్ర కలిగిన వ్యక్తిగా ముద్ర ఉందని పోలీసు విచారణలో తేలింది. వీటితోపాటు దేవదాయశాఖకు చెందిన ఆలయ భూములతో పాటు ప్రభుత్వ భూముల ఆక్రమణకు చల్లాబాబు పాల్పడినట్టు కూడా స్థానికంగా విమర్శలు ఉన్నాయి. ఇతనిపై పుంగనూరు నియోజవర్గ పరిధిలోని పలు పోలీస్‌స్టేషన్లలో పలు కేసులు నమోదయ్యాయి. ఈ దాడి ఘటనల్లో భాగస్వామ్యులైన మరికొందరు తెలుగుతమ్ముళ్లపై కూడా బోలెడన్ని కేసులున్నాయి. ఆ కేసులను కూడా పోలీసులు వెలికి తీసి, వాటిని కూడా నిశితంగా పరిశీలించారు. అందులో కొన్ని కేసుల వివరాలు..

- 1. చల్లా బాబుపై నమోదున పాత కేసుల వివరాలు..
- 1.1985 సంవత్సరంలో రొంపిచెర్ల పోలింగ్‌స్టేషన్‌పై బాంబు కేసులు
- 2.రొంపిచెర్ల క్రైం నంబరు 368, 2021లో ఐపీసీ సెక్షన్లు, 143, 188, 341, 269, 270, 290 ఐపీసీ రెడ్‌విత్ 149 ఐపీసీ, సెక్షన్ 3 ఈడీయాక్ట్
- 3. క్రైం నంబరు 18–2021 ఐపీసీ సెక్షన్లు 353, 506 రెడ్‌విత్ 34 ఐపీసీ కింద కేసు నమోదు.
- 4.క్రైం నంబరు 8–2022 ఐపీసీ సెక్షన్లు 188,341 కింద చౌడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.
- 5.క్రైం నంబరు 89–2023 ఐపీసీ సెక్షన్లు 143, 341, 506 రెడ్‌విత్ 149 ఐపీసీ కింద సోమల పీఎస్‌లో కేసు నమోదు
- 6.క్రైం నంబరు 72–2022 ఐపీసీ సెక్షన్లు 341, 143, 290 రెడ్‌విత్ 149 ఐపీసీ కింద కేసు
- 7.క్రైం నంబరు 26–2022 ఐపీసీ సెక్షన్లు 341, 353, 143, 147, 148 రెడ్‌విత్ 149 ఐపీసీ కింద కల్లూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

పుంగనూరులో 2019 సంవత్సరం ఏప్రిల్ 7న జనసేన అభ్యర్థిగా పోటీ చేసిన బోడె రామచంద్రయాదవ్‌పై ఎన్నికల సమయంలో డబ్బుల టోకెన్లు పంపిణీ చేశారని నియోజకవర్గంలో అప్పట్లో 7 పోలీసు కేసులు నమోదయ్యాయి. అప్పట్లో రూ.8 లక్షలు విలువ చేసే టోకెన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో..

- 2023లో ఏప్రిల్‌లో జరిగిన సాఫ్ట్‌వేర్ ఇంజనీరు నాగరాజు హత్య కేసులో ఏ2 ముద్దాయిగా టీడీపీ నాయకుడు చాణక్య ప్రతాప్ ఉన్నాడు. ఇతను బ్రాహ్మణపల్లి మాజీ సర్పంచ్‌గా పని చేశారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ హత్యకేసులో చాణక్య ప్రతాప్‌పై రామచంద్రాపురం మండలం పోలీసులు కేసునమోదు చేశారు. ఇక గంగాధర నెల్లూరు టీడీపీ అభ్యర్థి రేసులో ఉన్న థామస్‌పై కూడా తమిళనాడు కేంద్రంగా పలు కేసులు ఉన్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

కుప్పంలో..

- చంద్రబాబు కుప్పంలో పర్యటించిన పర్యటించిన ప్రతిసారి ఏదో ఒక విధ్వంసం జరగడం ఖాయం. పలు సందర్భాల్లో విధ్వంసం చేసిన ఘటనల్లో ఎమ్మెల్సీ కలిచెర్ల శ్రీకాంత్, నియోజవర్గ ఇన్‌చార్జి పీఎస్ మునిరత్నం, మాజీ జెడ్పీటీసీ రాజ్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మాజీ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ సత్యేంద్ర శేఖర్, కుప్పం రూరల్ టీడీపీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్‌పై సుమారు 25 కేసులు ఉన్నాయి. వీరంతా బెయిల్‌పై ఉన్నారు.

మంత్రి పెద్దిరెడ్డినే లక్ష్యంగా చేసుకుని..

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని రాజకీయంగా దెబ్బతీయడమే లక్ష్యంగా పుంగనూరులో టీడీపీ గూండాలు అల్లర్లకు తెరదీశారు. గతేడాది ఆగస్టులో చంద్రబాబు పర్యటన సందర్భంగా ప్రణాళిక ప్రకారం పోలీసులపై దాడులు చేశారు. పచ్చమూకల కారణంగా ఓ పోలీసు కానిస్టేబుల్ కన్ను పోగొట్టుకున్నాడు.

పథకం ప్రకారమే దాడులు..

రక్తపాతం సృష్టించి వైఎస్సార్‌సీపీపై నిందలు మోపేందుకు పచ్చనేతలు పథకం ప్రకారమే విధ్వంసానికి దిగారు. కర్రలు, రాళ్లు, మద్యం సీసాలు, మారణాయుధాలతో విచక్షణారహితంగా దాడులకు పాల్పడ్డాడు. అయితే పోలీసులు సంయమనంతో వ్యవహరించడంతో టీడీపీ కుట్ర భగ్నమైంది. ఈ అల్లర్ల కేసులో ప్రధాన సూత్రదారి, పాత్రధారి పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా బాబు అలియాస్ చల్లా రామచంద్రారెడ్డిగా పోలీసులు తేల్చారు. దాడులకు కుట్ర పన్నడం, వ్యూహ రచనలో చల్లా బాబుదే ప్రధాన పాత్రగా నిర్ధారించారు. అతనితోపాటు సుమారు 300 మంది టీడీపీ కార్యకర్తలపై కేసు నమోదు చేశారు. చల్లా బాబు గతమంతా నేరాల మయమే అని పోలీసుల విచారణలో తేలింది.

- 2019 ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థిగా ఎన్.దయారాం పోటీచేసి ఘోరంగా ఓడిపోయారు. ఇతనిపై చిత్తూరు నగరంలోని 1 టౌన్, 2 టౌన్ పీఎస్‌లలో కేసులు నమోదయ్యాయి. హైకోర్టులో ఒక కేసు నమోదైంది. చిత్తూరు జిల్లా కేంద్రానికి సమీపంలో మంగసముద్రం వద్ద శ్రీదత్తనగర్ పేరుతో మ్యూచువలి ఎయిడెడ్ కో ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీని ఏర్పాటు చేసి పలువురిని మోసం చేశారు. దీంతో అతనిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. చిత్తూరు నగరంలోని 2 టౌన్ స్టేషన్‌లో 2022 సెప్టెంబర్ 15వ తేదీన ఎఫ్ఐఆర్ 323, ఐపీసీ 408, 417, 420, 465 కేసులు పెట్టారు. సొసైటీ పేరుతో రూ.50 కోట్లు విలువ చేసే ఆస్తిని అప్పనంగా దోచేసేందుకు ప్రయత్నాలు చేశారు. 100 మందితో సొసైటీని ఏర్పాటు చేసి రూ.25 వేలు డిపాజిట్, వెయ్యి రూపాయాలు షేర్ క్యాపిటల్, అలాగే ఒక్కొక్కరి దగ్గర రూ.8.50 లక్షల చొప్పున వసూలు చేసి మోసం చేశారనే ఫిర్యాదులు ఉన్నాయి. కేసులు నమోదు కావడంతో సొసైటీకి దయారాం రాజీనామా చేశారు. ఆ తర్వాత సొసైటీ కొత్త అధ్యక్షుడికి లెక్కలు ఇవ్వకుండా మోసం చేయడంతో మరో కేసును పెట్టారు. ఆయనపై రెండు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

నగరి నియోజకవర్గంలో..

- గంజాయి అమ్ముతూ పట్టుబడిన టీడీపీ నేతలు
- నారా లోకేష్‌కు, గాలి భానుకు నిందితుడు హరికృష్ణ సన్నిహితుడు



అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ రామరాజు, సర్కిల్‌లో టీడీపీ నేతలు శరవణ, హరికృష్ణ (ఫైల్)

పుత్తూరు పట్టణంలోని స్వర్ణా హౌసింగ్ కాలనీలో గతేడాది మార్చి 9వ తేదీన గంజాయి విక్రయిస్తున్న ఆరుగురిని పుత్తూరు పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో నాగలాపురం మండలం వినోబానగర్‌కు చెందిన ఏ.విజయభాస్కర్(22), నెల్లూరు బాలాజీనగర్‌కు చెందిన కె.యూకేష్(21), పుత్తూరుకు చెందిన కాశీం మస్తాన్(29), టి.సందీప్‌కుమార్(27), సీ.ఎం.శరవణ(35), బి.ఎస్.హరికృష్ణ అలియాస్ హరి(30) ఉన్నారు. వీరి వద్ద నుంచి రూ.2.52 లక్షలు విలువ చేసే 21.05 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గతంలో కూడా పలు కేసుల్లో అరెస్ట్ అయిన హరికృష్ణ.

- గతేడాది జనవరి 10వ తేదీన విజయనగరం జిల్లా కాపుసోంపురం వద్ద 28 కేజీల గంజాయిని కారులో తరలిస్తుండగా అక్కడి పోలీసులు అరెస్టు చేశారు. నలుగురు నిందితుల్లో పుత్తూరుకు చెందిన ఇద్దరు టీడీపీ నాయకులు ఉన్నారు. అందులో హరికృష్ణ ఏ2గా, హేమంత్ ఏ3 నిందితుడు. ఈ కేసులో బెయిల్‌పై బయటికి వచ్చిన హరికృష్ణ మరోసారి గంజాయి కేసులోనే పుత్తూరు పోలీసులకు పట్టుబడ్డాడు. హరికృష్ణ టీడీపీ నేత నారా లోకేష్‌కు, నగరి టీడీపీ ఇన్‌చార్జ్ గాలి భానుప్రకాష్‌కు అత్యంత సన్నిహితుడు. హరికృష్ణ పుత్తూరు పట్టణ తెలుగు యువత అధ్యక్షుడిగా, శరవణ పుత్తూరు పట్టణ టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడిగా పనిచేశారు.
- ఇక నగరి నియోజకవర్గం అభ్యర్థిగా ప్రచారం చేసుకుంటున్న గాలి భానుప్రకాష్‌పై కూడా పలు కేసులు ఉన్నాయి. అందులో కేసు నంబరు 381/2023 పరువునష్టం కేసు కింద ఐపీసీ 499, 500 సెక్షన్లు, మహిళపై నిందమోపి భయభ్రాంతులకు గురిచేసినందుకు ఐపీసీ 354, 506 సెక్షన్ల కింద, ఇరువర్గాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినందున సెక్షన్ 153ఏ కింద నగరి సివిల్ మెజిస్ట్రేట్ కోర్టులో 380/2023 నమోదైంది.

అక్కచెల్లెమ్మల సొంతింటి కల సాకారం

- మొదటి విడతలో 20,301 మంది లబ్ధిదారులు
- వడ్డీరాయితీ కింద రూ.2,57,30,508 కోట్లు జమ
- కలెక్టర్ వెంకటరమణారెడ్డి



మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: అక్కచెల్లెమ్మల సొంతింటి కల సాకారమైందని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. గురువారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి నవరత్నాలు – పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా 4,07,323 మంది లబ్ధిదారులకు వడ్డీ రియింబర్‌మెంట్ కింద రూ.46.90 కోట్లను ముఖ్యమమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కంప్యూటర్ బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాలో జమచేశారు. అదే సమయంలో జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమానికి పలువురు అధికారులు, లబ్ధిదారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నవరత్నాలు – పేదలందరికీ ఇళ్ల లబ్ధిదారులు వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలో 72,437 ఇళ్లు మంజూరుకాగా.. అందులో ఇప్పటివరకు 20,824 ఇళ్లు పూర్తయ్యాయని, మిగిలిన ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఇందులో 20,301 మంది లబ్ధిదారులకు పావలా వడ్డీ కింద రూ.35 వేల చొప్పున బ్యాంకులు రుణాలు ఇవ్వగా.. వారు తీసుకున్న రుణాలకు వడ్డీ రాయితీని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రూ.2,57,30,508 కోట్ల వరకు జమచేశారని తెలిపారు. ఆ మొత్తాన్ని సంబంధిత లబ్ధిదారుల ఖాతాలలో జమచేసినట్టు వెల్లడించారు. అనంతరం లబ్ధిదారులతో కలిసి మెగా చెక్కును ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా హౌసింగ్ అధికారి వెంకటేశ్వర్లు, డీఈ శ్రీనివాసరావు, మెప్మా పీడీ రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లు మౌల్డింగ్ దశలో ఉంది



నేను నా భర్త మేస్త్రి పని చేసుకుంటూ పిల్లల్ని చదివిస్తున్నాం. జగనన్న ప్రభుత్వం ఇంటి స్థలం, ఇల్లు మంజూరు చేసింది. ఇంటి నిర్మాణానికి రూ.35 వేలు బ్యాంక్ రుణం కూడా ఇప్పించింది. ఆ రుణానికి వడ్డీ కూడా జగనన్న ప్రభుత్వమే చెల్లిస్తోంది. ప్రస్తుతం ఇల్లు మౌల్డింగ్ స్టేజ్‌లో ఉంది. మా ఇంటికి అమ్మఒడి, పింఛన్ కూడా లబ్ధి చేకూరింది. సీఎం జగనన్నకి రుణపడి ఉంటాం.

– లక్ష్మి, జీవకోన

చాలా సంతోషంగా ఉంది



మేము 20 ఏళ్లుగా అద్దె ఇంట్లో ఉంటున్నాం. నెలకు రూ.5వేలు అద్దె చెల్లిస్తున్నాం. నా భర్త ఓ హోటల్‌లో పని చేస్తున్నారు. ఆయన సంపాదనతోనే ఇంటి ఖర్చులు, అద్దె చెల్లిస్తున్నాం. జగనన్న ప్రభుత్వం వచ్చాక ఇంటి స్థలం మంజూరైంది. బ్యాంక్ ద్వారా రూ.35 వేలు లోన్ తీసుకుని ఇల్లు కట్టుకున్నా. వడ్డీ కూడా సీఎం జగనన్నే చెల్లిస్తున్నారు. మా కుటుంబానికి అమ్మఒడి, ఆసరా పథకం ద్వారా ఆర్థిక సాయం అందుతోంది. చాలా సంతోషంగా ఉంది.

– సుజాత, గాయత్రీనగర్

క్లుప్తంగా

మేము సైతం

తిరుపతి కల్చరల్: సామాజిక న్యాయానికి స్ఫూర్తిగా విజయవాడ స్వరాజ్ మైదానంలో శుక్రవారం సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనాన్ని ప్రారంభించనున్నారు. ఈ చారిత్రక ఘట్టాన్ని ఘట్టానికి తిరుపతి నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో తిరుపతి నుంచి విజయవాడకు ప్రత్యేకంగా పది ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయగా.. సుమారు 500 మంది బహుజనులు స్వచ్ఛందంగా తరలి వెళ్లారు.

బైక్ దొంగల అరెస్ట్

నాయుడుపేట: బైక్ దొంగలను అరెస్ట్ చేసినట్టు స్థానిక డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. నాయుడుపేట పోలీస్ స్టేషన్ వద్ద గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఆ వివరాలు వెల్లడించారు. పట్టణంలోని అమరాగార్డన్‌కు చెందిన యువకులు ఆర్కాట్ రాజేష్, చిత్తూరు మునిశంకర్, పెనుబాక బాలక్రిష్ణ, సోగ దుర్గయ్య జల్సాలకు అలవాటు పడి పట్టణంలో రాత్రివేళల్లో సంచరిస్తూ మారు తాళాలతో మోటార్ బైక్‌లు దొంగలించేవారన్నారు. ప్రయివేట్ పరిశ్రమల్లో పనిచేస్తూ.. జల్సాల కోసం బైక్ దొంగతనాలకు పాల్పడేవారని చెప్పారు. ఈ మేరకు వీరిపై ప్రత్యేక నిఘా ఉంచి అరెస్ట్ చేసినట్టు వెల్లడించారు. వీరి నుంచి రూ.7.95 లక్షల విలువైన 9 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. సమావేశంలో సీఐ జగన్‌మోహన్‌రావు, ఎస్‌ఐలు రఘునాథ్, క్రిష్ణయ్య, కె.శ్రీకాంత్, హెడ్‌కానిస్టేబుల్ మస్తా న్, కరీంబాయ్‌తో పాటు కుమార్‌రాజా, దయాకర్, భానుతేజ పాల్గొన్నారు.



పల్లె ప్రగతితోనే దేశాభివృద్ధితోపాటు గ్రామ స్వరాజ్య స్థాపన సాధ్యం.. ఇదీ గాంధీమహాత్ముడి కల. అది సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థతో సాకారమైంది. ఈ వ్యవస్థతో అవినీతి రహిత పారదర్శక పాలన..పల్లె ముంగిటకే ప్రభుత్వ సేవలు చేరువయ్యాయి. ఫలితంగా వ్యయ ప్రయాసలు.. కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు తప్పాయి.

- గాంధీజీ కల సాకారం
- పల్లె ముంగిటకే ప్రభుత్వ యంత్రాంగం
- గ్రామీణులకు చేరువైన సేవలు


నూతనంగా నిర్మించిన సచివాలయం

సచివాలయం.. పల్లెకు మకుటం

మండలం	మంజూరైన సచివాలయాలు	పూర్తి	వివిధ దశల్లో
1.పెళ్లకూరు	13	08	05
2.ఓజిలి	10	07	03
3.నాయుడుపేట	24	06	18
4.సూళ్లూరుపేట	19	09	10
5.దొరవారిసత్రం	11	03	08
6.తడ	16	07	09
మొత్తం	93	40	53


పెళ్లకూరు సచివాలయంలో సర్టిఫికెట్ పొందుతున్న లబ్ధిదారుడు

పెళ్లకూరు: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి స్వతంత్ర్య భారతావనిలో ఏ సీఎం చేపట్టని సరికొత్త ఆలోచనలతో నూతన సంస్కరణలకు శ్రీకారం చుట్టి, గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేస్తున్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటుతో ప్రజలకు పలు రకాల సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. అటు సచివాలయ ఉద్యోగులు, ఇటు వలంటీర్లు ప్రజలకు విస్తృతంగా సేవలందిస్తున్నారు. దరఖాస్తు చేసుకున్న 15 నిమిషాలకే 47రకాల సేవలు, 72 గంటల్లో 148 రకాల సేవలు, 72 గంటలకు 311 రకాల సేవలు అందిస్తూ అర్జీదారులకు ఇబ్బందులు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడంలో సచివాలయ వ్యవస్థ జాతీయ స్థాయి గుర్తింపు పొందింది. పింఛన్, రేషన్‌కార్డు, సదరం స్లాట్ బుకింగ్, ఆరోగ్యశ్రీ కార్డు, వన్‌బీ, అడంగల్, భూములు రిజిస్ట్రేషన్, ఇళ్ల రిజిస్ట్రేషన్, జనన, మరణ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు మీసేవా కేంద్రాల్లో అందించే సేవలన్నీ సచివాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉన్నాయి.

రూ.37.20 కోట్లతో నూతన భవనాలు

సూళ్లూరుపేట నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మొత్తం 93 సచివాలయాలకు నూతన భవనాల నిర్మాణం కోసం రూ.37.2 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఇప్పటికే 40 సచివాలయ భవనాలు పూర్తి చేసి, ప్రజలకు పలు రకాల సేవలు అందిస్తున్నారు. మరో 53 సచివాలయ భవనాలు వివిధ దశల్లో పనులు జరుగుతున్నప్పటికీ అద్దె భవనాల నుంచి ప్రజలకు పూర్తిస్థాయి సేవలు అందిస్తున్నారు. గత ప్రభుత్వ పాలనలో సుదూర ప్రాంతాల నుంచి వ్యయ ప్రయాసల కోర్చి మండల కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగేవారు. ప్రస్తుతం సొంత గ్రామాల్లోనే అందుబాటులో ఉన్న వలంటీర్ నేరుగా ఇంటి వద్దకు వచ్చి ప్రజల సమస్యలను తెలుసుకుని, తక్కువ సమయంలో సమస్యను పరిష్కరిస్తున్నారు.

సచివాలయ సేవలు బాగు



“ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయాల్లో ప్రజలకు అందిస్తున్న సేవలు చాలా బాగున్నాయి. సామాన్య రైతులు వన్‌బీ, అడంగల్ పొందడానికి అనేక కష్టాలు పడే రోజుల నుంచి జగనన్న ప్రభుత్వంలో సచివాలయాల ద్వారా పనులు సులభంగా జరుగుతున్నాయి. పనులు మానుకుని మండల కార్యాలయానికి వెళ్లి, రోజుల తరబడి వేచి ఉండే బాధలు తప్పాయి.

– ఆనందయ్య, చింతపూడి, పెళ్లకూరు

ప్రదక్షిణలు తప్పాయి



ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల కోసం గత ప్రభుత్వ హయాంలో మండల కార్యాలయం చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగేవాళ్లం. జగనన్న ప్రభుత్వంలో పల్లె ముంగిటకే అన్ని సేవలు అందుతున్నాయి. దీంతో మాకు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసే పని తప్పింది. ప్రభుత్వ పథకాలను పొందడం కోసం అర్హులందరూ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకునే అవకాశం కలిగింది.

– వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు, చెంబేడు

వ్యయ, ప్రయాసలు లేవు



పిల్లలకు జన, మరణ, కుల, ఆదాయ తదితర సర్టిఫికెట్లు, రేషన్, ఆధార్ కార్డులు పొందడం కోసం మారుమూల గ్రామం నుంచి మండల కేంద్రాలకు వెళ్లే పరిస్థితి లేకుండాపోయింది. అందుబాటులో ఉన్న సచివాలయాల్లో దరఖాస్తు చేసుకునే అవకాశం కలిగింది. దీంతో లబ్ధిదారులకు వ్యయ, ప్రయాసలు లేవు. జగనన్న ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉంటూ పేదలకు చాలా మేలు చేస్తోంది.

– తిరుపాలయ్య, అర్థమాల, పెళ్లకూరు మండలం

ప్రజలకు చాలా మేలు



సచివాలయ వ్యవస్థ అమలులోకి వచ్చినప్పటి నుంచి ప్రతి పనికీ పట్టణానికి వెళ్లకుండా సచివాలయంలోనే పరిష్కరించుకుంటున్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి ప్రజలకు చాలా మేలు చేశారు. గతంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవాళ్లం. ప్రస్తుతం ఖర్చు తగ్గింది, సమయం వృథా కావడం లేదు.

– చెంగయ్య, మన్నేముత్తేరి, సూళ్లూరుపేట మండలం

అందుబాటులో అధికారులు



సచివాలయాల ఏర్పాటుతో అధికారులు అందుబాటులో ఉంటున్నారు. తద్వారా భూ సమస్యలు, రెవెన్యూ సమస్యలను వెంటనే పరిష్కరించుకునే అవకాశం కలిగింది. అలాగే ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవడం కూడా సులువు అయ్యింది. జనన, మరణ, కుల, ఆదాయ తదితర ధ్రువీకరణ పత్రాలు తెచ్చుకోవవానికి మండల కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం తప్పింది.

– ఉచ్చూరు రమణారెడ్డి, మాజీ సర్పంచ్ పెళ్లకూరు

పల్లెల్లోనే విస్తృత సేవలు



సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థతో ప్రజలకు గ్రామాల్లోనే ప్రభుత్వ సేవలు విస్తృతంగా అందుతున్నాయి. దీంతో మండల కేంద్రాలకు, అధికారుల చుట్టూ తిరిగే బాధలు తొలగిపోయాయి. అందుబాటులో ఉన్న సచివాలయ సేవలను సద్వినియోగం చేసుకుంటున్నాం. జగనన్న మేలు ఎప్పటికీ మరువలేం.

–గోపాలయ్య, శిరసనంబేడు, పెళ్లకూరుమండలం

21న నాయుడుపేటలో ‘సాధికార బస్సు యాత్ర’


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

తడ: నాయుడుపేటలో ఆదివారం జరిగే సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతం చేయాలని స్థానిక ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పిలుపునిచ్చారు. గురువారం పూడి గ్రామం వద్ద ఓ ప్రైవేటు హోటల్ ఆవరణలో మండల నాయకులతో ఆయన సమావేశమై దిశానిర్దేశం చేశారు. ప్రజాసమస్యలను నవరత్నాల పేరుతో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిష్కరించారని తెలిపారు. అయినా కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడి ఇబ్బందులు పడుతున్న వారిని గుర్తించి, వారి సమస్యలు తొగించేందుకు సామాజిక సాధికార బస్సు యాత్ర చేపట్టినట్టు వెల్లడించారు. ఈ యాత్ర విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ సైనికులు వలే పనిచేయాలన్నారు. సమావేశంలో ఎంపీపీ కే.రఘురెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కే.ఆర్ముగం, జేసీఎస్ కన్వీనర్ ఆర్‌కే.సుందర్‌రెడ్డి, నాయకులు టీ.కో దండం, నాగరాజారెడ్డి, పరమశివంరెడ్డి, ఏ.మునస్వామిరెడ్డి, మునీష్ రెడ్డి, వాసు మొదలియార్, కే.మురుగన్, తిరుమలైరెడ్డి, నత్తం శ్రీనివాసులు, బీ.జయకుమార్‌రెడ్డి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అవార్డుకు ఎంపిక


పాఠశాల గ్రీన్‌కోర్ విద్యార్థులతో శ్యామలత

నారాయణవనం: స్థానిక బాలికోన్నత పాఠశాలకు చెందిన హరిత పాఠశాల స్థాయిలో అవార్డుకు ఎంపికైనట్లు హెచ్ఎం శశికళ తెలిపారు. ఇటీవల పాఠశాలలో 2023–24 విద్యాసంవత్సరానికి గాను న్యూఢిల్లీకి చెందిన జాతీయ గ్రీన్ కోర్ వివిధ అంశాలపై రికార్డులను ఆడిట్ చేసి అవార్డుకు ఎంపిక చేసినట్లు వెల్లడించారు. జనవరి 30న ఢిల్లీలో కేంద్ర మంత్రి చేతుల మీదుగా పాఠశాల గ్రీన్ కోర్ కో–ఆర్డినేటర్ శ్యామలత అవార్డు అందుకుంటారని తెలిపారు. గత ఏడాదీ అవార్డు లభించిందని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల గ్రీన్‌కోర్ విద్యార్థులను రాష్ట్ర గ్రీన్ కోర్ ఇన్‌చార్జి నీలాకాంతయ్య, డీఈవో శేఖర్, పుత్తూరు ఉప విద్యాశాఖాధికారి ఆనందరెడ్డి, ఎంఈవోలు ప్రభాకర్‌రాజు, గోవిందస్వామి అభినందించారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి


మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి

చంద్రగిరి: రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం సాయంత్రం మండల పరిధిలోని నరసింగాపురం రైల్వే గేటు వద్ద చోటు చేసుకుంది. స్థానికుల వివరాలు.. సుమారు 32 సంవత్సరాల వయసు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి రైల్వే గేటు వద్దకు చేరుకున్నాడు. స్థానిక చిరువ్యాపారుల వద్ద మంచినీళ్లు అడిగి తాగాడు. అనంతరం రైలు వచ్చే క్రమంలో ఎదురుగా వెళ్లి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు హిందీలో మాట్లాడాడని, స్థానికుడు కాదని చెబుతున్నారు.

మత్స్యకార్మికుడి మృతి

పిచ్చాటూరు: అరణియార్‌లో చేపల వేటకు వెళ్లి మండలంలోని పాతగొల్ల కండ్రిగకు చెందిన చెల్లయ్య(60) మృతి చెందాడు. బంధువుల కథనం.. మత్స్యకార వృత్తి జీవనాధారంగ చెల్లయ్య జీవిస్తున్నాడు. ఈ క్రమంలో ఎప్పటిలాగే గురువారం వేకువజామున వలలతో అరణియార్‌కు చేరుకుని తెప్పపై నుంచి వల వదులుతుండగా మూర్ఛవచ్చి నీటిలో పడి మృతి చెందాడు. జలాశయంలో తెప్ప మాత్రం తేలుతుండడాన్ని గుర్తించిన తోటి మత్స్యకారులు చెల్లయ్య ఆచూకీ కోసం గాలించారు. అనంతరం చెల్లయ్య మృత దేహాన్ని గుర్తించి బయటకు తీశారు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు.

తుడా మాజీ చైర్మన్‌కు నివాళి



తుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌నాయుడుకు నివాళి అర్పించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, లక్ష్మి దంపతులు, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

- హాజరైన ఎమ్మెల్యే చెవిరెడ్డి కుటుంబం

పాకాల: గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న తుడా మాజీ చైర్మన్ ఎల్‌బీ.ప్రభాకర్‌నాయుడు బుధవారం రాత్రి మండలంలోని పాకాలలో మృతిచెందారు. మృతుని కుటుంబాన్ని గురువారం ఉదయం చంద్రగిరి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, లక్ష్మి దంపతులు, అలాగే తుడా చైర్మన్, చంద్రగిరి సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పరామర్శించారు. ప్రభాకర్‌నాయుడు మృతదేహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ప్రభాకర్‌నాయుడు మృతి పార్టీకి తీరని లోటని, పార్టీకి ఆయన చేసిన సేవలు మరవలేమని కొనియాడారు. మండల అభివృద్ధిలో కీలకపాత్ర పోషించారని గుర్తుచేసుకున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నామన్నారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పి ఓదార్చారు. అలాగే పలువురు నాయకులు ఆయన సేవలను కొనియాడారు. ఇందులో మండల కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎన్ఆర్.జయదేవ్‌నాయుడు, ఎంపీపీ లోకనాథం, సర్పంచ్ ఎస్.కస్తూరి, పులివర్తి సుధారెడ్డి, వినీల్.నాగరాజనాయుడు, కపిలేశ్వర్‌రెడ్డి, మురళీమనోహర్‌చౌదరి, సురేష్, ప్రకాష్‌రెడ్డి, రమేష్, చంటి, నాగూర్, భాస్కర్‌రెడ్డి, భాస్కర్‌నాయుడు, మోహన్‌నాయుడు, రాయలసీమ మోహన్ ఉన్నారు.

భారత్‌లో సర్పంచ్‌ల పాత్ర కీలకం

- రాబోవు రోజుల్లో వారు సలహాలు ఇచ్చే స్థాయిలో ఉండాలి
- పాల్గొన్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



కేంద్ర మంత్రి కపిల్ మోరేశ్వర్ పాటిల్‌కు జ్ఞాపిక అందజేస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

తిరుపతి సిటీ: పంచాయతీ సర్పంచ్ భారత దేశంలో కీలక వ్యక్తి అని, రాబోవు రోజుల్లో వారు సలహాలు ఇచ్చేలా ఉండాలని కేంద్ర పంచాయతీరాజ్ శాఖ సహాయ మంత్రి కపిల్ మోరేశ్వర్ పాటిల్ తెలిపారు. గురువారం స్థానిక పద్మావతీ మహిళా వర్సిటీ ఇందిరా ప్రియదర్శినీ ఆడిటోరియం వేదికగా మూడు రోజుల పాటు జరగనున్న హెల్తీ విలేజ్ జాతీయ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. వికసిత్ భారత్ లక్ష్యం 2047 నాటికి భారత్ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడమేనన్నారు. సర్పంచ్‌ల్లో ఆత్మవిశ్వాసం నిండుగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో సర్పంచులు, స్వయం సహాయక సంఘాల మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు.

రాష్ట్రంలో గ్రామస్వరాజ్యం

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి బుడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం.జగన్‌మోహన్‌రెడ్డి పంచాయతీలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారన్నారు. గ్రామస్థాయిలో గ్రామసచివాలయాలు, ఆరోగ్యకేంద్రాలు, అంగన్‌డీలు ఏర్పాటు చేసి అభివృద్ధి, సంక్షేమం దిశగా ముందుకెళ్తున్నట్టు వెల్లడించారు. ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలు, ఆరోగ్యకేంద్రాలు, రోడ్లు, మురికి కాలువల నిర్మాణాలకు ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ కాంపొండ్ నిధులు అనుసంధానం చేసి పూర్తిచేస్తున్నట్టు వెల్లడించారు. జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందిస్తున్నట్టు తెలిపారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా ముందుకు సాగుతున్నామన్నారు. అనంతరం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి పలు రకాల స్టాల్స్‌ను ముఖ్యఅతిథులు పరిశీలించారు. జాతీయ అవార్డులు పొందిన గ్రామ పంచాయతీల నుంచి అవార్డులు అందుకున్న సర్పంచులు తమ ప్రతిభను సభా వేదికగా పంచుకున్నారు. గ్రామ పంచాయతీల పాత్ర, ఆరోగ్య రక్షణ, సీనియర్ సిటిజన్ల అవసరాలు, ప్రజల సంస్కృతి, డ్రగ్స్ బారిన పడిన వారి సంరక్షణ వంటి విషయాలపై జాతీయ సదస్సులో చర్చించారు. ఈ సమావేశంలో జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ సూర్యకుమారి, సీఈఓ ప్రభాకరరెడ్డి, సెంట్రల్ జాయింట్ సెక్రటరీ వివేక్ భరద్వాజ్, అదనపు కార్యదర్శి చంద్ర శేఖర్‌కుమార్, జాయింట్ సెక్రెటరీ వికాస్ ఆనంద్, జేసీ శుభం భన్సల్, పలు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి సర్పంచులు, స్థానిక సంస్థల ప్రతినిధులు, స్వయంసహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.


జాతీయ సదస్సుకు హాజరైన వివిధు రాష్ట్రాల ప్రజాప్రతినిధులు, అధికారులు



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న పంచాయతీ రాజ్ కమిషనర్ సూర్యకుమారి